క్లుప్తంగా

మెరుగైన వసతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉందని పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు మెరుగైన వసతులను కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రామసుబ్బయ్య, సీవీప్రసాద్ కోరారు. ప్రతి గదిలో ఫ్యాన్లు , కూల్ వాటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పెరిగిన రేట్లను అనుగుణంగా రెమ్యూనరేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. గూగుల్ ఫామ్ నింపిన వారికి భత్యాలు ఉండవన్న అనుమానాలను విద్యాశాఖ అధికారులు నివృత్తి చేయాలని కోరారు.

'98' డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

కడప ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన ప్రకారం డీఎస్సీ 98 అభ్యర్థులందరికి ఉద్యోగాలను ఇవ్వాలని 98–డీఎస్సీ అభ్యర్థులు చంద్రమౌళి, చంద్రశేఖర్‌రెడ్డి, వాసు విన్నవించారు. ఈ విషయమై శనివారం వారు కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోస్టర్ పద్ధతి ప్రకారం పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వలేదని, ఆర్డర్ ఆఫ్ మెరిట్ వల్ల ఎస్సీ, బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. అభ్యర్థులు వెంకటేష్, కోటీశ్వరావు, వెంకటరమణ, మధు, సుధాకర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 6వ మహాసభలు

కడప వైఎస్సార్ సర్కిల్: నగరంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ 6వ జిల్లా మహా సభలను నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం బీఎస్ఎన్ఎల్ టెలికాం మేనేజర్ షేక్ ముజీబ్ పాషా, జనరల్ మేనేజర్లు హాజరుకానున్నట్లు వివరించారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

ఆటోనగర్‌కు స్థలం కేటాయించాలి

కడప వైఎస్సార్ సర్కిల్: నగరంలో ఆటో మొబైల్ రంగంలో పని చేస్తున్న వారి కోసం కొప్పర్తి పారిశ్రామిక వాడలో ఆటో నగర్‌కు అవసరమైన స్థలం కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలో దాదాపు వెయ్యి మంది దాకా ఆటో మొబైల్ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న గ్యారేజీల బాడుగలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. అధికారులు స్పందించాలని కోరారు. సీపీఎం నగర కమిటీ సభ్యులు ఫరూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ పరీక్షలు తెలుగులో నిర్వహించాలి

కడప వైఎస్సార్ సర్కిల్: కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ నియామక పరీక్షలు తెలుగులో నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఉద్యోగ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం హోం శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ 9212 ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు ప్రకటన జారీ చేసిందన్నారు. ఈ పరీక్షలు కేవలం హిందీ, ఇంగ్లీష్‌లో మాత్రమే నిర్వహించడం ద్వారా తెలుగువారికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. 9212 ఉద్యోగాలలో ఏపీలో 428, తెలంగాణ 307 ఉద్యోగాలు ఉన్న తెలుగులో రాసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దక్షిణ భారతదేశంలో 2062 ఉద్యోగ నియామకాలు చేపడుతున్నారని ..దక్షిణాది భాషలో నిర్వహించాలన్నారు.

'రవీంద్రనగర్' అధ్యక్షుడిగా హరినారాయణరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప అసెంబ్లీ పరిధిలోని రవీంద్రనగర్ మండల బీజేపీ అధ్యక్షునిగా యాపనేని హరినారాయణరావును నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు యల్లారెడ్డి తెలిపారు. శనివారం ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకంపై యాపనేని హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు యల్లారెడ్డికి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ యాదవ్, జిల్లా కార్యదర్శి అనంత కేశవలకు కృతజ్ఞతలు తెలిపారు.

19న సమావేశం

కడప రూరల్: తిరుపతిలో ఈ నెల 19న వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి చిన్న సుబ్బయ్య యాదవ్ తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి నిర్వహించే ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

దుస్తుల పంపిణీ

కడప కల్చరల్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని నిరుపేదలకు ఎంపీజే జిల్లా అధ్యక్షులు వీఎస్ రహమతుల్లా ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. నిరుపేద ముస్లిం బాలల్లో 106 మందికి నూతన వస్త్రాలను, 90 మంది పెద్దలకు చీరలు, లుంగీలు అందజేశారు. సంఘ సేవకులు సయ్యద్ జాఫర్ హుసేన్, సి.దస్తగిరి సాహెబ్, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'ను వేగవంతం చేయాలి

- కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో మేయర్ సురేష్ బాబు



కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: 'మా నమ్మకం నువ్వే జగన్' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడానికి నిర్వహిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మేయర్ సురేష్ బాబు తెలిపారు. శనివారం సాయంత్రం కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 7 నుంచి ప్రారంభమైన పీపుల్స్ సర్వే ఈనెల 20వ తేదికి ముగుస్తుందన్నారు. అయితే ఇప్పటికీ చాలామంది సర్వే పూర్తి చేయలేదని, ప్రతి ఇంటి నుంచి మిస్డ్ కాల్ చేయించాల్సి ఉండగా, తక్కువ కాల్స్ నమోదయ్యాయన్నారు. ఇక ఐదు రోజులే సమయం ఉన్నందున కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. డివిజన్‌లో అన్ని ఇళ్ల నుంచి ఫోన్ కాల్స్ వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాకా సురేష్, సానపురెడ్డి శివకోటిరెడ్డి, మల్లికార్జున, కో ఆప్షన్ సభ్యులు బండి మరియలు, పత్తిరాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, ఎస్. సుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జి. శ్రీనివాసులరెడ్డి, రెడ్డి ప్రసాద్, త్యాగరాజు, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆప్కో డైరెక్టర్‌కు అభినందనలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆప్కో డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉదయగిరి వెంకటేశ్‌ను కడప నగర మేయర్ సురేష్‌బాబు అభినందించారు. శనివారం ఆప్కో కార్యాలయంలో మేయర్ సురేష్‌బాబు వెంకటేశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం చేనేతలను అన్ని విధాలా ప్రోత్సహిస్తోందన్నారు. అనంతరం డైరెక్టర్ ఉదయగిరి వెంకటేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఆప్కో డైరెక్టర్‌గా నియమించడంపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. చేనేతకు తనవంతుగా అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆప్కో డీఎంఓ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వానికి మద్దతివ్వండి

కడప కార్పొరేషన్: దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్న ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ 20వ డివిజన్ కార్పొరేటర్ వై.మాధవి, ఇన్‌చార్జ్ శ్రీరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా వారు ఇంటింటికీ వెళ్లి పీపుల్స్ సర్వే నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలకు మధ్య ఉన్న తేడాను వివరించారు. వారి మొబైల్ నుంచి మిస్డ్‌కాల్ ఇప్పించారు.



సర్వే చేపడుతున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి తదితరులు

ఆకట్టుకున్న 'సై సైరా' నాటక ప్రదర్శన



సైసైరా నరసింహారెడ్డి నాటక ప్రదర్శనలో కళాకారులు

వైవీయూ : తెలుగువారి శౌర్యానికి, దేశభక్తికి ప్రతీక ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని వైవీయూ అధికారులు పేర్కొన్నారు. శనివారం యోగివేమన విశ్వవిద్యాలయంలోని సురభి సమావేశ మందిరంలో తెలుగు నాటకరంగ దినోత్సవం, కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య జింక రంగజనార్ధన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మార్గదర్శనంలో లలితకళల విభాగం ఆధ్వర్యంలో సైసైరా నరసింహారెడ్డి నాటకం, ఏకపాత్రాభినయాలు నిర్వహించారు. నాటకం ఆద్యంతం ఆకట్టుకుంది. సైసైరా నరసింహారెడ్డి నాటకంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాత్రను ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పోషించడంతో పాటు నాటకానికి దర్శకత్వం వహించడం విశేషం. కార్యక్రమంలో వైవీయూ ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, లలితకళల విభాగాధిపతి కోట మృత్యుంజయరావు డీఎస్పీ ఎల్. సుధాకర్, ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ చిన్నపరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి లియోనార్డో డావిన్సీ

- వైవీయూ లలితకళల విభాగాధిపతి మృత్యుంజయరావు



లియోనార్డో డావిన్సీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

వైవీయూ: లియోనార్డో డావిన్సీ బహుముఖ ప్రజ్ఞాశాలి అని వైవీయూ లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు పేర్కొన్నారు. శనివారం వైవీయూ లలితకళల విభాగం ఆధ్వర్యంలో ప్రముఖ చిత్రకారుడు లియోనార్డో డావిన్సీ జయంతి, ప్రపంచ చిత్రకళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లియోనార్డో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత పెయింటింగ్ 'మోనాలిసా' సృష్టికర్త అయిన లియోనార్డో కేవలం చిత్రకారుడిగానే కాక శాస్త్రవేత్తగా కూడా పేరుగాంచాడన్నారు. లలితకళల శాఖ ఆచార్యులు మల్లికార్జునరెడ్డి మాట్లాడారు. అధ్యాపకులు సి.హెచ్. వెంకటేష్, అప్పలాచారి, బి. చినరాయుడు, బి.ఈరప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు విద్యే ఆయుధం



మధ్యాహ్న భోజన రుచి చూస్తున్న ప్రభాకర్ రెడ్డి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు చదువే ఆయుధం అని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప చెమ్ముమియాపేట బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మనబడి నాడు–నేడు పనులతోపాటు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం పెట్టుకుని సాధన చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తిన్నారు. ప్రతి విద్యార్థి జగనన్న గోరుముద్ద, రాగిజావాను తప్పకుండా ఉపయోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, సీఆర్‌పీ నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన అంబేడ్కర్ వారోత్సవాలు

కడప కార్పొరేషన్: భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా రక్షణ స్వచ్ఛంద సంస్థ, జై భీమ్ మాల మహాసేన ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, ఆటల పోటీలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం స్థానిక మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ మాల మహాసేన ఉపాధ్యక్షులు లావణ్య సుధాకర్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోనేటి షాలినికి డాక్టరేట్ ప్రదానం



కోనేటి శాలిని

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కోనేటి షాలినికి ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈమె ప్రొఫెసర్ కె.రాజశేఖర్ పర్యవేక్షణలో 'మ్యాథమ్యాటికల్ మాడలింగ్ ఆఫ్ హాల్ ఎఫెక్ట్స్ ఆన్ పెరిస్టాలిటిక్ ఫ్లో ఆఫ్ ఫ్లూయిడ్స్ త్రూ పోరస్ మీడియం' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా కోనేటి షాలినిని తల్లిదండ్రులు శేషయ్య ఆచారి, లక్ష్మి తులశమ్మ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు తదితరులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి



ప్రచార భేరి పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు : రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా దగా చేసిన బీజేపీని గద్దె దింపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య పిలుపునిచ్చారు. స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో శనివారం మోదీని గద్దె దింపండి – దేశాన్ని కాపాడండి, కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేకత, నిరంకుశ విధానాలపై ప్రచార భేరి పోస్టర్లను సీపీఐ, సీపీఎం నాయకులు విడుదల చేశారు. బి.రామయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటు పరం చేస్తుంటే వైఎస్సార్‌సీపీ ఎంపీలు మౌన ముద్ర పాటించి బీజేపీకి మద్దతు ప్రకటించారన్నారు. రాష్ట్రానికి బుందేల్ ఖండ్ ప్యాకేజీ ఇస్తామన్న బీజేపీ నేడు రాష్ట్రానికి చిల్లి గవ్వ ఇవ్వలేదని మండిపడ్డారు.ఫెడరల్ స్ఫూర్తిని కాపాడుకోవాలంటే అన్ని వర్గాల ప్రజలు ఏకమై మోదీని గద్దె దింపాలని కోరారు. సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్, యేసోబ్, చంద్రశేఖర్, ప్రతాప్, మీరా వలి, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మాస్క్ కమిటీ సేవలు అభినందనీయం

బద్వేలు : బద్వేలు మాస్క్ కమిటీ.. పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శనివారం పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో మాస్క్ కమిటీ అందించిన రంజాన్ తోఫాను ఆయన పేదలకు పంపిణీ చేశారు. 150 మందికి బియ్యం, నిత్యావసరాలు, మరో 100 మందికి బియ్యం, కొంత నగదు అందించారు. ఈ సందర్భంగా బద్వేలు మాస్క్ కమిటీ అధ్యక్షులు అల్లాబకాష్‌ను అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, బద్వేలు మున్సిపాలిటీ కౌన్సిలర్లు కరిముల్లా, సరిటాల మౌలాలి, ఖాజీసాహెబ్ షఫిఅహ్మద్, సయ్యద్‌బాబు, ఫ్రూట్‌షఫి, సింగిల్‌విండో అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, పోరుమామిళ్ల వైస్ ఎంపీపీ సి.బాషా, కో ఆప్షన్ సభ్యులు అల్లా, ఎంపీటీసీ ఇషాక్, నాయుడు పాల్గొన్నారు.

అత్యాధునిక వసతులతో బస్టాండు



బస్టాండు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

కమలాపురం: కమలాపురం పట్టణం నడిబొడ్డున ఆర్టీసీ బస్టాండు నిర్మాణం పట్టణానికే తలమానికం అని ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజుల రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పాత బస్టాండు ఉన్న ప్రాంతంలోనే రూ. 1.08 కోట్లతో మంజూరైన నూతన బస్టాండు నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ 57 సెంట్ల స్థలంలో మూడు ప్లాట్ ఫాంలతో ఈ బస్టాండును అత్యాధునిక సాంకేతికత, హంగులతో నిర్మిస్తున్నామన్నారు. ఇదే స్థలంలో దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఆర్టీసీ బస్టాండు శిథిలమై పోవడంతో తాను ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తో కలసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నూతన బస్టాండును మంజూరు చేయించామన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం ప్రతి బస్సు పట్టణంలోనికి రావడమే లక్ష్యంగా ఈ బస్టాండు నిర్మాణం చేపట్టామన్నారు. ఆరు నెలల్లో పూర్తి చేసి బస్సుల రాకపోకలు సిద్ధం చేస్తామన్నారు.

పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

కమలాపురం పట్టణంలో ఇప్పటికే డ్రైనేజ్, సీసీ రోడ్లు, పాలిటెక్నిక్ కళాశాల, మార్కెట్ యార్డులో షాపింగ్ కాంప్లెక్స్‌లు, 50 పడకల ఆసుపత్రి తదితర నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండును అత్యాధునికంగా నిర్మిస్తామన్నారు. అలాగే ఆర్ఓబీ, బైపాస్, ఇంటింటికి కుళాయి కనెక్షన్ తదితరవి పూర్తి చేస్తే పట్టణం అన్ని హంగులతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంత అభివృద్ధి చేస్తున్నా టీడీపీ ఉనికి చాటుకోవడం కోసం విమర్శలు చేస్తోందని మండి పడ్డారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలన్నారు. వారి విమర్శలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కమలాపురం వాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, కాంట్రాక్టర్ బాలగంగాధర్ రెడ్డి, నాయకులు సీఎస్ నారాయణరెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, హిదాయత్, గఫార్, చెన్నకేశవరెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఆర్‌పీఎస్‌ఆర్, జావీద్, జగన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఖాజాపీర్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

తొండూరు : ఖరీఫ్‌లో రైతులు పంటలు సాగు చేసే సమయంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా పాటించాలని శాప్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రవీంద్రారెడ్డి మాట్లాడుతూ చాలామంది రైతులు వ్యవసాయంలో మెలకువలు పాటించక పంటలు నష్టపోతున్నారన్నారు. అందువల్ల ఖరీఫ్‌లో ప్రతి రైతు భూసార పరీక్షలు నిర్వహించి ఏ సమయంలో ఏ మందులు పిచికారి చేయాలో వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకుని సాగు చేయాలన్నారు.

పశువైద్య శిబిరం

బి.కోడూరు : జిల్లా పశుసంవర్ధకశాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మూలవారిపల్లెలో ప్రభలవీడు పశువైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో మెగా పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న వాటర్‌షెడ్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ పాడి పశువులతో రైతులు మంచి లాభాలు పొందవచ్చని, బి.కోడూరు మండలంలో పశుగణాంకాలు ఎక్కువగా ఉండటం వలన దానిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కృషి వలన అదనంగా ప్రభలవీడుకు ఒక పశువైద్యాధికారిని నియమించడం జరిగిందన్నారు. అనంతరం 25 పశువులకు, 750 గొర్రెలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శివారెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వంశీ, నాగేంద్ర, బాలయ్య, రవి, నాయకులు వెంకటరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి తిరునాల

వల్లూరు: కడప – తాడిపత్రి ప్రధాన రహదారి పక్కన పాపాఘ్ని నగర్ (కట్ట బస్టాపు) వద్ద వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి తిరునాల శనివారం అత్యంత ఘనంగా జరిగింది. ఉదయం అర్చకులు స్వామి వారికి అభిషేకాలను, అర్చనలు నిర్వహించారు. ఆకు పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీలను నిర్వహించి మొదటి 5 స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులను అందచేశారు.

నేడు బండ లాగుడు పోటీలు ..

వీరాంజనేయ స్వామి తిరునాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు బండలాగుడు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. పోటీలలో మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండవ బహుమతి రూ 20 వేలు, మూడవ బహుమతి రూ 15 వేలు, నాలుగవ బహుమతి రూ 10 వేలు, ఐదవ బహుమతి రూ 8 వేలు, ఆరవ బహుమతి రూ 5, 016 , ఏడవ బహుమతి రూ 3, 016 లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : వల్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 6 వ తరగతి, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు గానూ అర్హులైన వారు ఈ నెల 20 తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపల్ నసీమున్నీసా ఒక ప్రకటనలో తెలిపారు. 6 వ తరగతిలో 40 సీట్లు , ఇంటర్ బైపీసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ కుటుంబాలకు చెందిన బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

చక్రాయపేట: చక్రాయపేటలోని కస్తూర్బా పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పర్వీన్ తెలిపారు. వివరాలకు 93989 48416 నంబరుకు ఫోన్ చేయాలని చెప్పారు.

ముగిసిన వేడుకలు

కడప ఎడ్యుకేషన్: కందుల విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మాజీ శాసనమండలి, శాసనసభ్యులు కందుల శివానందరెడ్డి జయంతి వేడుకలు శనివారం ముగిశాయి. కేఎస్‌ఆర్‌ఎం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ కమ్ ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ ఈ కళాశాల ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు విద్య, ఉపాధి అందించిందన్నారు. కళాశాల అభ్యున్నతికి కందుల శివానందరెడ్డి అహర్నిశలు కృషి చేశారని.. ఆయన లక్ష్య సాధనకు కృషి చేస్తామన్నారు. కళాశాల వైస్ చైర్మెన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కడప అర్బన్: కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పాతకడప దళితవాడ సమీపంలో శనివారం ఉదయం కంపచెట్లలో జూదమాడుతున్న ఐదుగురిని సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు, ఎస్ఐ ఎస్‌కే రోషన్ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారిలో ప్రసన్నకుమార్, సురేంద్ర,తరుణ్, కార్తీక్, మల్లికార్జున ఉన్నారు. వారి వద్ద నుంచి రూ. 14,600 నగదు సీజ్ చేశారు.

ప్రత్యేక పూజలు



గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసి ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం శ్రావణ నక్షత్రం సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

దివ్యాంగులకు దుస్తులు పంపిణీ

ప్రొద్దుటూరు: మండలంలోని అమృతానగర్‌లో శనివారం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా 17వ వార్డు మెంబర్ బీబీజాన్, ఆమె భర్త హుస్సేన్, కుమారుడు అల్లాబకాష్ దివ్యాంగులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. వీటిని ఎంపీటీసీ డిష్ శ్రీను చేతుల మీదుగా దివ్యాంగులకు అందించారు. సొసైటీ గౌరవాధ్యక్షుడు వై.చలపతిరావు, వలంటీర్ బావమ్మ, సావిత్రి, మల్లేశ్వరి, సంజీవ్ కుమార్, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం

ప్రొద్దుటూరు : నెహ్రూ యువకేంద్రం, వికసిత ఫౌండేషన్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి హాజరయ్యారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

ప్రొద్దుటూరు కల్చరల్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాలిసెట్‌కు ఈనెల 16 నుంచి ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జేవీవీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వీవీ శివారెడ్డి, ఎన్.సునీత తెలిపారు. పాలిసెట్ ఉచిత కోచింగ్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి చదివిన విద్యార్థులకు స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో అత్యుత్తమ ఫ్యాకల్టీతో ఉచితంగా పాలిసెట్ కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే 9705432038కు ఫోన్ చేసి ఎన్‌రోల్ చేసుకోవాలని సూచించారు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

దువ్వూరు :దువ్వూరులోని మకాం వీధిలో నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి శనివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.54,100 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే ఐ.బయనపల్లె గ్రామంలో జూదమాడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. రూ.4,200 స్వాధీనం చేసుకున్నామన్నారు.